క్లుప్తంగా

28 నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హయత్‌నగర్: వర్ధనగర్ కాలనీ కమిటీ హాల్ వద్ద నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు కాలనీ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు, హోమాలు, అభిషేకాలు, గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరపనున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉత్సవం నేపథ్యంలో భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ట్రైకార్ చైర్మన్‌కు ఘనస్వాగతం



బెల్లయ్యనాయక్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆమనగల్లు: ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న పార్టీ సమావేశానికి వెళ్తున్న నాయక్‌తో పాటు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిలకు స్వాగతం పలికి సన్మానించారు. ఇందులో పార్టీ నాయకులు కృష్ణనాయక్, శ్రీనునాయక్, రాగ్యనాయక్, శ్రీధర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు, వెంకట్‌రెడ్డి, రాజేందర్ నాయక్, రమేశ్‌నాయక్, హర్యానాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు అభినందనీయం



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేసిన మంగమ్మ

అబ్దుల్లాపూర్‌మెట్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ తుర్కయాంజాల్ పురపాలక సంఘం అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. ఆమె కుమారుడి వివాహం సందర్భంగా.. సోమవారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి గౌరెల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులుగౌడ్, భగవాన్‌దాస్, రాజు, శ్రీనివాస్, దాసు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు వినతి



ఎంపీ రవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి కోరారు. ఈ మేరకు సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. పీహెచ్‌సీ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 260/70లో 9 ఎకరాల 36 గుంటల ప్రభుత్వ స్థలం ఉందని, అందులో ఆస్పత్రి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, నాయకులు ఇమ్రాన్‌బాబా, భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్, షాబుద్దీన్ ఉన్నారు.

షాద్‌నగర్ ఏడీఏ బదిలీ

షాద్‌నగర్: గత ఏడేళ్లుగా షాద్‌నగర్ వ్యవసాయ డివిజనల్ అధికారిగా(ఏడీఏ) విధులు నిర్వహిస్తున్న రాజారత్నంకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ సోమవారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణపేట అగ్రికల్చర్ టెక్నాలజీ(ఆత్మ) పీడీగా బదిలీపై వెళ్లారు. షాద్‌నగర్ ఏడీఏగా అధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు. కొత్త ఏడీఏ వచ్చేవరకు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిషాంత్ ఇన్‌చార్జిగా ఉండనున్నారు.

సమస్యల నిలయం.. ప్రయాణ ప్రాంగణం



అభివృద్ధికి నోచుకోని ఆమనగల్లు బస్టాండ్

- సౌకర్యాల లేమితో ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

ఆమనగల్లు: దినదినాభివృద్ధి చెందుతున్న పట్టణంలో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రయాణికులకు అనుగుణంగా తీర్చి దిద్దడంలో సంస్థ విఫలమయింది. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం అస్తవ్యస్తంగా మారి, అసౌకర్యానికి నిలయంగా మారింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్టాండ్‌లో వసతుల లేమితో ప్యాసింజర్స్‌తో పాటు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

వందలాది బస్సుల రాక

పట్టణంలోని బస్టాండ్‌కు నిత్యం వందలాది బస్సులు వస్తుంటాయి. ఆమనగల్లు మీదుగా శ్రీశైలం, హైదరాబాద్, యాదగిరిగుట్ట, సంగారెడ్డి, వరంగల్, కల్వకుర్తి, అచ్చంపేట తదితర ప్రాంతాలకు పరుగులు తీస్తుంటాయి. ఇక్కడి నుంచి వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మేరకు ప్రయాణికుల సందడితో సంస్థకు ఆదాయం ఉన్నా.. సౌకర్యాల కల్పనలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రయాణికులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం తాగునీటి వసతి లేదని వాపోతున్నారు. వేసవిలో శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే చలివేంద్రమే దాహార్తిని తీరుస్తుందని పేర్కొంటున్నారు. బస్టాండ్‌లో ఒక క్యాంటిన్ ఏర్పాటుకే సంస్థ పరిమితమైందని విమర్శించారు. ఇదిలా ఉండగా.. బస్టాండ్ ఆవరణలోని షెడ్డులో ద్విచక్ర వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో బస్సుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఈ మేరకు బస్టాండులో సమస్యలు పేరుకుపోయినప్పటికీ.. బస్టాండ్ చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసి అద్దె రూపేణా రవాణా సంస్థ భారీగా ఆదాయం పొందుతోందని, అయినప్పటికీ.. సంస్థకు జీవనాడి అయిన ప్రయాణికుల సౌకర్యాలను విస్మరించిందని ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎమ్మెల్యేకు విన్నపం..

బస్టాండ్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అవసరమైన వసతులు కల్పించాలని, అదనంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. ఇదే విషయమై ఇటీవల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బస్టాండును సందర్శించిన నేపథ్యంలో అక్కడి పరిస్థితులను పలువురు ఆయనకు వివరించారు. ప్రయాణ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

ఆటపాటల్లోనూ రాణించాలి



ఆమనగల్లు: మాట్లాడుతున్న కమిషనర్



యాచారం: విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు: విద్యార్థులు చదువుతో పాటు ఆటాపాటలల్లోనూ రాణించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ సూచించారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా, తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ తీసుకోవాలన్నారు. పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ పాండుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 19 వరకు కరాటే, యోగా, ఆటలు, పాటలు, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచితంగా అల్పాహార వసతి కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడొద్దని చెప్పారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ జాన్సన్, డ్యాన్స్ మాస్టర్ ప్రభుశంకర్, పీఈటీ అజీం, సీఆర్‌పీలు షేక్ అహ్మద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

చింతపట్లలో..

యాచారం: మండల పరిధి చింతపట్ల గ్రామం ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఇంగ్లిష్, గణితం, డ్రాయింగ్, క్రీడా పోటీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణకు వచ్చిన చిన్నారులకు అల్పాహారం అందజేశారు. ఈ శిబిరం 15 రోజుల పాటు ఉపాధ్యాయులు అంజయ్య, సాబేర్, శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో కొనసాగుతుందని ఎంఈఓ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ స్టేషనరీని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ఆమనగల్లు: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పెయింటర్‌కు పెయింటర్స్ యూనియన్ నాయకులు అండగా నిలిచారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన మహ్మద్ మస్తాన్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న అసోసియేషన్ నాయకులు బాధితున్ని పరామర్శించి, రూ.20వేలు ఆర్థికసాయం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షుడు మహేశ్, కోశాధికారి వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు మహ్మద్ సయ్యద్, సభ్యులు దావ ఆనంద్, జంగయ్య తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

తుర్కయంజాల్: కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ తెలిపారు. సమ్మెలో అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం- 1947లోని సెక్షన్ 22, సబ్ సెక్షన్ (1)ని అనుసరించి కమిషనర్‌కు నోటీసు అందచేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, జె.ఆశీర్వాదం, బి.మాల్యాద్రి, ఎ.మాధవరెడ్డి, దయానంద్, ప్రవీణ్, సరిత ఉన్నారు.

సుస్థిర వ్యవసాయమే లక్ష్యం

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి..

- సాగులో దిగుబడులు పొందండి
- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి
- 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' ప్రారంభం

కడ్తాల్: భవిష్యత్ తరాలకు సుస్థిర వ్యవసాయ పద్ధతులను అందించడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం- వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్‌తో పాటు మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, విశ్వ విద్యాలయ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, సయ్యద్ అహ్మద్ హుస్సేన్, డాక్టర్ మాధవీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వచ్చి సలహాలు, సూచనలు అందించడం గొప్ప విషయమని, వారి సూచనల మేరకు రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు సాగులోని మెలకువలు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ అరుణకుమారి, ఏఓ శ్రీలత, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు బీక్యానాయక్, నర్సింహ, బీచ్యానాయక్, జంగారెడ్డి, చందోజీ, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనూష, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ పద్ధతిలో వ్యవసాయం

తుర్కయంజాల్: రైతులు కృత్రిమ పద్ధతిలో వ్యవసాయం చేయాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐఎస్‌పి ప్రోగ్రాం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు ప్రశ్నలకు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రజనీకాంత్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, మండల వ్యవసాయ అధికారి పల్లవి, ఏఈఓ రఘుపతి, శాస్త్రవేత్త అరుణ, రైతులు లక్ష్మారెడ్డి, బల్‌దేవ్ రెడ్డి, ఐలయ్య, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

మార్కెట్ చైర్‌పర్సన్ గీత



రైతులకు భోజనం వడ్డిస్తున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం సొంత డబ్బుతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం విక్రయించడానికి మార్కెట్‌కు వచ్చే రైతులకోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానని, ప్రస్తుత సీజన్ ముగిసేవరకు భోజనం అందిస్తానని చెప్పారు. రైతులు భోజన వసతిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదాతలు దళారులను ఆశ్రయించకుండా.. కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని, సన్నాలను రూ.500 బోనస్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, అజీం, రమేశ్‌గౌడ్, నరేశ్ నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, కల్వకుర్తి తాలుకా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఇమ్రాన్‌బాబా, మల్లయ్య, ఖాదర్, నాజర్, నరేశ్‌నాయక్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



ఎమ్మెల్యే సబితారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదినం సందర్భంగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, వీరయ్య, సురేశ్ తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఆ గ్రామానికి చెందిన ఇతర పార్టీల నుంచి సుమారు వంద మంది తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమన్నారు. అధిక నిధులతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో నియోజకవర్గం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తల చూపు మొత్తం ఇటువైపే ఉందని స్పష్టంచేశారు. మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అమృతాసాగర్, లిక్కి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల బహూకరణ

షాద్‌నగర్: మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నేత రవీందర్‌రెడ్డి వీధి లైట్లను బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి గ్రామానికి 20 వీధి లైట్లను కార్యదర్శి విజయలక్ష్మికి అందజేశారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి లైట్లు అందజేసినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంచంద్రారెడ్డి, అమరేందర్ రెడ్డి, కేశవులు, నరేశ్, బుచ్చిరెడ్డి, సాయిరెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, కరుణాకర్, బాలయ్య, ఆంజనేయులు, కన్నా, భీమోజీ, యాదయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

11న లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ రాతికి స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణోత్సవం ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆ దేవాలయ భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపింది. 10న స్వామి వారికి సుప్రభాతసేవ, ఆరాధన, శ్రీ విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, ఋత్విక్‌కరణం, అంకురార్పణ, శ్రీ సుదర్శన నరసింహ హోమం, ధ్వజారోహనం, మహానివేదన, విష్ణు సహస్రనామ పారాయణం, అష్టోత్తర అర్చన, అమ్మవారి కుంకుమార్చన. 11న నిత్యపూజ కైంకర్యం, నృసింహస్వామి మహాయాగం, అభిషేకం, మధ్యానిక ఆరాధన, లఘు నివేదన అనంతరం రాత్రి 7.30 గంటలకు స్వామివారి కల్యాణం. 12న నిత్యపూజ, శ్రీ మహాలక్ష్మియాగం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి బదిలీ



యాచారం: ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కమిషనర్, గ్రామీణాభివృద్ధికి ఫైనాన్స్ మేనేజర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఇదిలా ఉండగా.. మండల పరిధి మాల్ గ్రామ పంచాయతీకి 'ఆత్మ నిర్భర్' నేషనల్ పంచాయతీ అవార్డు రావడంలో ఆయన కృషి ఎనలేనిదని పలువురు కొనియాడారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

కడ్తాల్: ఆధార్‌తో దేశంలో ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చిన విధంగానే, భూమి ఉన్న ప్రతి రైతుకు 11 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య(యూనికోడ్) రాబోతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత తెలిపారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసే ప్రక్రియలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో యూనికోడ్ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆమె చెప్పారు. భూమి ఉన్న రైతు.. ఆధార్‌కార్డు, భూ సమాచారంతో వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి, యూనిక్ కోడ్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా విజయ్‌నాయక్



యాచారం: బీజేపీ యాచారం మండల అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి తండాకు చెందిన జర్పుల విజయ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

క్యాంటిన్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: పట్టణంలోని కోర్టు ఆవరణలో క్యాంటిన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు. కోర్టుకు వచ్చే కక్షిదారుల సౌకర్యార్థం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రూ.2 వేలు టెండర్ ఫీజు చెల్లించి, అర్జీ పెట్టుకోవాలని సూచించారు.